క్లుప్తంగా

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట కోర్టు కాలనీకి వెళ్లే రహదారిలో గల ఆంజనేయ స్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బోడసింగి జగ్గనాయుడు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణ నిర్వహించారు.

అవగాహన..



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి గోవిందమ్మ

గజపతినగరం: కౌలు రైతులందరూ గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి గోవిందమ్మ సూచించారు. మండలంలోని కాలంరాజుపేటలో కౌలురైతులతో అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌలుకార్డు కలిగి ఉంటే ప్రకృతి వైపరీత్యాల సమయంలో పరిహారం అందుతుందని చెప్పారు. అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను అందజేశారు. తర్వాత శ్రీరంగరాజపురం గ్రామంలో కూడా రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల పరిశీలన



ఏకేజే పాలెంలో మద్యం దుకాణం పరిశీలిస్తున్న ఎక్సైజ్ ఎస్సై రాజు

వేపాడ: మండలంలోని పలు మద్యం షాపులను కొత్తవలస ఎక్సైజ్ ఎస్సై బీవీఎస్ రాజు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాకు రిజిస్టర్లు పరిశీలించడంతో పాటు సమయపాలన, పరిశుభ్రతపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒక వ్యక్తికి మూడు బాటిల్స్ కంటే ఎక్కువ విక్రయించకూడదని సూచించారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎటువంటి కార్యకలాపాలు చేపట్టినా చర్యలు తప్పవన్నారు. మండలంలోని అంకాజోస్యులపాలెం, వేపాడ, జాకేరు, బొద్దాంలో గల దుకాణాలను పరిశీలించడంతో పాటు అంకాజోస్యులపాలెం కేఆర్ పేట, కుమ్మపల్లి గ్రామ పరిసరాల్లోని తోటల్లో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు.

భక్తిభావం పెంపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంగాధర్

లక్కవరపుకోట: గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజల్లో భక్తిభావం మరింత పెంపొందించాలని సమరసత సేవా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర ధర్మ ప్రచారక్ ఎ.గంగాధర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో జిల్లా కమిటీ, మండల కన్వీనర్లతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ధార్మిక కార్యక్రమాలను విరివిగా నిర్వహించాలన్నారు. అలాగే భక్తిభావం పెంపొందించేందుకు పలు రకాల ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టాలన్నారు. అలాగే జూన్ నెలలో నిర్వహించబోయే కార్యక్రమాల వివరాలు, అమలు చేసే ప్రణాళికలపై చర్చించారు. కార్యక్రమంలో ధర్మప్రచారక్ సంఘ సభ్యులు ఆర్.బలరాంనాయుడు, కేవీ రమణ, ఐదు మండలాల కన్వీనర్లు పాల్గొన్నారు.

జిందాల్ సమావేశం వాయిదా

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర సాయిభవానీ కల్యాణ మంటపంలో గురువారం నిర్వహించాల్సిన జిందాల్ నిర్వాసితుల సమావేశం తాత్కాలికంగా వాయిదా వేసినటుల ఎమ్మెల్సీ రఘురాజు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. జిందాల్ పరిశ్రమ కోసం వేల ఎకరాల భూములిచ్చిన రైతులకు అటు యాజమాన్యం గాని ఇటు ప్రభుత్వం గాని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దీంతో సీపీఐ, సీపీఎంలతో కలిసి ఉద్యమిస్తున్న తరుణంలో గురువారం సమావేశం నిర్వహించాలనుకున్నామని చెప్పారు. అయితే కూటమి పెద్దలు మహనాడు తర్వాత ఈ విషయమై చర్చిద్దామని సమాచారం పంపడంతో.. సమావేశాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు చెప్పారు. రైతులకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని స్పష్టం చేశారు.

శిథిలావస్థలో అగ్నిమాపక కార్యాలయం

- పెచ్చులూడుతున్న శ్లాబ్, బీటలు వారుతున్న గోడలు
- బిక్కుబిక్కుమంటు విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- పట్టించుకోని ఉన్నతాధికారులు

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని అగ్నిమాపక కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనంలో ఏ గోడ చూసినా బీటలు వారి ఎప్పుడు పడిపోతాయో అన్న చందంగా ఉన్నాయి. శ్లాబ్ ఎక్కడికక్కడే పెచ్చులూడిపోయి కూలేందుకు సిద్ధంగా ఉందని సిబ్బంది చెబుతున్నారు. 1988లో అప్పటి హోమ్ మినిస్టర్ కోడెల శివప్రసాదరావు , ఎక్సైజ్ శాఖా మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు ఆధ్వర్యంలో సుమారు ఎకరా ముప్పై సెంట్ల స్థలంలో భవనం పనులు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఆ భవనంలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే భవనం 80 శాతానికి పైగా శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవనం నిర్మించాలని సిబ్బంది కోరుతున్నారు. భవనం పరిస్థితిపై ఉన్నతాధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి స్పందన లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



పెచ్చులూడుతున్న శ్లాబ్

సిబ్బంది కొరత

అగ్నిమాపక శాఖ గజపతినగరం సర్కిల్‌కు సంబంధించి గజపతినగరం, మెంటాడ, బొండపల్లి, దత్తిరాజేరు మండలాల్లో ఉన్న సుమారు 130 గ్రామాల్లో ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా సేవలు అందించడం జరుగుతుంది. అయితే సిబ్బంది కొరత వల్ల సేవలు అందించడంలో కొంత ఇబ్బంది పడాల్సి వస్తోంది. డ్రైవర్లు ఇద్దరు, హెడ్ కానిస్టేబుళ్లు ముగ్గురు, సహాయకులు ఐదుగురు, హోంగార్డులు ముగ్గురు ఉండగా.. ఇంకా ఫైర్‌మెన్ పోస్టులు నాలుగు భర్తీ చేయాల్సి ఉంది. సిబ్బంది సరిపడా లేకపోవడంతో రెండు,మూడు ప్రమాదాలు ఒకేసారి జరిగితే ఇబ్బందిగా మారుతోందని అధికారులు చెబుతున్నారు.

తెలియజేశాం..



అగ్నిమాపక శాఖ కార్యాలయ భవనం నిర్మించి 37 ఏళ్లు అవుతోంది. శ్లాబ్ పెచ్చులూడి, గోడలు బీటలు వారి ప్రమాదకరంగా మారింది. నూతన భవనం నిర్మించాలని లేని పక్షంలో కనీసం మరమ్మతులైనా చేపట్టాలని ఉన్నతాధికారులకు పలుమార్లు తెలియజేశాం. అయినా ఎటువంటి ఫలితం లేకపోయింది. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. –ఎస్‌కే రవిప్రసాద్, అగ్నిమాపక అధికారి, గజపతినగరం





అగ్నిమాపక శాఖ కార్యాలయం

అల్లుకున్న నిర్లక్ష్యం..

బుధరాయవలస నుంచి సోమలింగాపురం వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని బుదరాయవలస జీడిపప్పు పరిశ్రమ వద్ద ఓ విద్యుత్ స్తంభం దాదాపు చెట్టులా కనిపిస్తోంది. స్తంభానికి తీగలు అల్లుకుపోవడంతో పూర్తిగా స్తంభం కనిపించకుండా పోయింది. ఆ పక్కనే చెట్లు ఉండడంతో విద్యుత్ స్తంభం కూడా ఓ చెట్టులా దర్శనమిస్తోంది. విద్యుత్ శాఖాధికారులు స్పందించి స్తంభానికి అల్లుకున్న తీగలు తొలగించాలని పలువురు కోరుతున్నారు. – మెరకముడిదాం



ఉచిత వైద్య సేవలు..



శృంగవరపుకోట మండలంలోని ధర్మవరం కల్యాణ మంటపంలో పెదఖండేపల్లి సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విశాఖలోని మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సుమారు 150 మందిని పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. – శృంగవరపుకోట

జూన్ ఏడో తేదీలోగా కౌలు కార్డులు తీసుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు



కౌలురైతుకు కార్డు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి తారక రామారావు

గంట్యాడ: జూన్ 7వ తేదీలోగా కౌలు రైతులందరూ గుర్తింపు కార్డులు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి తారక రామారావు అన్నారు. మండలంలోని రామవరంలో కౌలు రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌలు గుర్తింపు కార్డుల వల్ల అనేక ప్రయోజనాలున్నాయన్నారు. విత్తనాలు, ఎరువులు రాయితీపై పొందడంతో పాటు పండించిన పంటలను కూడా విక్రయించుకోవచ్చని సూచించారు. అనంతరం పలువురు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పీరుబండి పద్మ, మండల వ్యవసాయాధికారి బి.శ్యామ్‌కుమార్, కార్యదర్శి దిలీప్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు..

శృంగవరపుకోట: కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి.. ప్రభుత్వం అందించే అన్ని రాయితీలు వర్తింపజేస్తామని మండల వ్యవసాయాధికారి రవీంద్ర అన్నారు. మండలంలోని ధర్మవరం, సంతగవిరమ్మపేట గ్రామాల్లో కౌలురైతులతో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌలుకార్డుల వల్ల అన్నదాత సుఖీభవ, ఈ క్రాప్ నమోదు, ధాన్యం కొనుగోళ్లు, పంట నష్టం, పంటల బీమా వంటి ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు రవి, శిరీష, వీఆర్వో సుధీర్, అడవినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



శృంగవరపుకోట: ధర్మవరంలో కౌలు రైతులతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు



కొత్తవలస: మాట్లాడుతున్న ఏఓ మాధురీశరణ్య

కౌలుపత్రం పొందాలి..

కొత్తవలస: కౌలుకు భూమి తీసుకుని సాగు చేస్తున్న ప్రతి రైతూ కౌలు గుర్తింపు కార్డులు పొందాలని మండల వ్యవసాయాధికారి మాధురీశరణ్య తెలిపారు. మండలంలోని బలిఘట్టాం రైతుసేవా కేంద్రంలో కౌలురైతుల గుర్తింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌలురైతుల గుర్తింపు కార్యక్రమాలను వచ్చేనెల 2వ తేదీ వరకు రైతుసేవా కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. ఇప్పటివరకు కేవలం 14 మంది రైతులకు మాత్రమే కౌలు పత్రాలు అందజేశామని.. 45 మంది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. కౌలు పత్రాలు పొందడం వల్ల పండించిన పంటను అమ్ముకోవడం, ప్రకృతి వైపరిత్యాల వల్ల పంట నష్టపోతే బీమా సదుపాయం వంటి ఎన్నో ప్రయోజనాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ప్రసాదరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం..

- జూన్ 4న చేపట్టనున్న 'వెన్నుపోటు దినం' విజయవంతం చేయాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నప్పటికీ ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన నేపథ్యంలో ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ మెంబర్, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని లావేరు రోడ్డులో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు చేసిన మోసాన్ని గుర్తు చేస్తూ.. జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినం నిర్వహించాలన్నారు. పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టనున్న వెన్నుపోటు దినంను విజయంతం చేయాలని కో రారు. ఆ రోజు పార్టీ శ్రేణులు చీపురుపల్లిలోని ఆంజనేయపురం వద్దకు చేరుకుని, అక్కడ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాలకు చెందిన పార్టీ శ్రేణులంతా హాజరుకావాలని కోరారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని.. ఈ నేపథ్యంలో ప్రజల తరపున పోరాటం చేయాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం , జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, జిల్లా బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడు బూర్లె నరేష్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, నియోజవకర్గ వలంటీర్ల విభాగం అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు, పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, పార్టీ నాయకులు కేవీ సూర్యనారాయణరాజు, తాడ్డి వేణు, శీర అప్పలనాయుడు, కొణిశ కృష్ణంనాయుడు, మీసాల విశ్వేశ్వరరావు, బెల్లాన బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.


31న పెన్షన్ల పంపిణీ

వేపాడ: జూన్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఆ నెలకు సంబంధించిన పెన్షన్‌ను మే 31న శనివారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా కారణం చేత 31న పెన్షన్ అందుకోలేని వారికి రెండో తేదీన అందజేస్తామని పేర్కొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

శృంగవరపుకోట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుపై ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసుండి, టెన్త్ నుంచి డిగ్రీ పూర్తి చేసిన యువతీయువకులు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల యువత జూన్ 4వ తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, పూర్తి వివరాలకు 79956 91295 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రెండు పశువుల వ్యాన్ల సీజ్



వ్యాన్‌లో ఉన్న పశువులు

దత్తిరాజేరు: అక్రమంగా తరలిస్తున్న రెండు పశువుల వ్యాన్లను ఎస్ బూర్జవలస పోలీస్‌స్టేషన్ వద్ద పట్టుకుని సీజ్ చేసినట్టు ఎస్సై జి.రాజేష్ గురువారం తెలిపారు. పార్వతీపురం నుంచి పెదమానాపురం తరలిస్తుండగా మందస్తు సమాచారం మేరకు ఒక వ్యాన్‌లో ఆరు పశువులు, మరో వ్యాన్‌లో 13 పశువులు అనుమతులు లేకుండా తరలిస్తుండగా పట్టుకుని పశువుల యజమాని, వాహనాల యజమాని మీద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

యోగాతో ఆరోగ్యం

దత్తిరాజేరు: యోగాతో మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మరడాంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓతో పాటు మాస్టర్ ట్రైనీ చంద్రరావు యోగాసనాల వల్ల కలిగే లాభాలను వివరించారు.

రోడ్డు నిర్మాణంపై ఫిర్యాదు



తహసీల్దార్ రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న తాళ్లపూడి కృష్ణ, తదితరులు

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామంలో సర్వే నంబర్ 6లో రాజు చెరువు గట్టుపై చేపడుతున్న రోడ్డు నిర్మాణంపై గ్రామానికి చెందిన సర్పంచ్‌ల సంఘ జిల్లా మాజీ అధ్యక్షుడు తాళ్లపూడి కృష్ణ స్థానిక తహసీల్దార్ డోలా రాజేశ్వరరావుకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. రాజు చెరువు గట్టును చదును చేసి , ఎటువంటి అనుమతుల్లేకుండా రోడ్డు వేస్తున్నారని.. దీనివల్ల చెరువు కింద పొలాలకు సాగునీరు అందదని చెప్పారు. ఈ విషయంలో అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ రాజేశ్వరరావు తెలిపారు. ఇదిలా ఉంటే గ్రామంలో మూడో రైల్వే లైన్ ఏర్పాటు చేయడంతో ప్రత్యామ్నాయ రోడ్డు వేస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. కార్యక్రమంలో పురమనేని బంగారు నాయుడు, పి.శంకరనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు..



సోంపురం వద్ద రహదారిపై ఏర్పడిన గుంత

వేపాడ: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గుంతల్లోకి వర్షపు నీరు చేరడంతో రోడ్డు చెరువును తలపిస్తోంది. సోంపురం – వేపాడ రహదారిలో సోంపురం గ్రామ సమీపంలో ఏర్పడిన భారీ గుంతతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ప్రమాదం తప్పదని వాపోతున్నారు. ప్రధాన రహదారిపై నిత్యం మండలాధికారులు రాకపోకలు సాగిస్తున్నా.. రహదారి గురించి పట్టించుకోకపోవడం విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

లెండికి ఎన్‌బీఏ టైర్‌–1 అక్రిడిటేషన్



ఎన్‌బీఏ గుర్తింపునిచ్చిన టైర్‌–1 పత్రాలను చూపుతున్న లెండి ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ రామారెడ్డి తదితరులు

డెంకాడ: మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలకు ఎన్‌బీఏ ద్వారా ప్రతిష్టాత్మకమైన టైర్‌–1 అక్రిడిటేషన్ పొందిందని కళాశాల ప్రిన్సిపాల్ వీవీ రామారెడ్డి తెలిపారు. ఈ గుర్తింపు పొందడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ నాణ్యతా విద్యాప్రమాణాలు పాటించిన సంస్థగా ఎదిగిందని వివరించారు. కళాశాల విద్యానైపుణ్యం , పరిశ్రమ ఆధారిత పాఠ్యాంశాలు, ఆధునిక మౌలిక సదుపాయాలు, నాణ్యతాప్రమాణాలు తదితర అనేక అంశాల ఆధారంగా ఎన్‌బీఏ టైర్‌–1 గుర్తింపు వస్తుందని చెప్పారు. లెండి ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ కళాశాల ప్రారంభం నుంచి ఎన్‌బీఏ టైర్ –1 వరకూ ఎదిగిన విధానాన్ని వివరించారు. గుర్తింపు రావడం పట్ల కళాశాల చైర్మన్ పి.మధుసూదనరావు,వైస్ చైర్మన్ పి.శ్రీనివాసరావులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ తమ్మినేని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా షటిల్ పోటీలు



టోర్నమెంట్‌లో హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

శృంగవరపుకోట: పట్టణంలోని కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ షటిల్ క్యాంప్‌లో భాగంగా ఇంటర్నల్ టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారు. చీఫ్‌కోచ్ పి. శ్రీరాములు నేతృత్వంలో చిన్నారులు హోరాహోరీగా తలపడుతున్నారు. గురువారం జరిగిన పోటీల్లో ఫోర్‌హెడ్, బ్యాక్‌స్ట్రోక్, డ్రాప్, టాస్, స్మాష్ వంటి షాట్‌లతో చిన్నారులు విరుచుకుపడ్డారు. గతంలో కోచ్ పి. శ్రీరాములు వద్ద కోచింగ్ తీసుకుని ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా ఉన్న దేవికారాణి వర్ధమాన క్రీడాకారిణి భరిణికాన హారికకు రూ.5000 విలువ చేసే యోనెక్స్ రాకెట్ బహూకరించింది. టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు శనివారం సాయంత్రం ముగింపు వేడుకల్లో బహుమతులు ఇవ్వనున్నట్లు కోచ్ శ్రీరాములు తెలిపారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు ధ్రువపత్రాలు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని మొత్తం 32 బాలల సంరక్షణ కేంద్రాలకు ధ్రువపత్రాలు అందజేసినట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి రుక్సానా సుల్తానా బేగమ్ తెలిపారు. నగరంలోని బాలల సంరక్షణ కేంద్రం నిర్వాహకుడికి ఆమె గురువారం ధ్రువపత్రం అందజేశారు.

పలు కేంద్రాలు సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా వాటిని కమిటీ సభ్యులు పరిశీలించి, ఆమోదించిన వాటికే ఇప్పుడు సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతోందన్నారు. నిర్వహణకు అనువుగా ఉన్న వాటికి ప్రొవిజినల్ సర్టిఫికెట్లు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీపీవో సత్యనారాయణ, డీసీపీవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం నిఘా ఉంచాలి



మహిళా పోలీసులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ గణేష్

నెల్లిమర్ల: గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పర్యవేక్షణకు నిరంతరం నిఘా ఉంచాలని ఎస్‌ఐ బి.గణేష్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సచివాలయ మహిళా పోలీసులతో గురువారం సమావేశమైన ఆయన.. ఎక్కడైనా చిన్నచిన్న గొడవలు జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలని, ఆ గొడవలు పెద్దవి అవ్వకుముందే మేల్కొంటే సమస్య త్వరగా పరిష్కారమయ్యేందుకు వీలుంటుందన్నారు. సమస్య తలెత్తినప్పుడు స్పందించకుంటే అది ముదిరి నేరాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల్లోని రౌడీషీటర్ల కదలికలు గమనించుకుని ఉండాలన్నారు.